వైభవంగా దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం



పరవాడ: మండలంలోని కన్నూరు శివారు మడకపాలెంలో కొలువైన దుర్గమాంబ అమ్మవారి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు మంగళవారం వైభవంగా జరిపారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దేవీపురంలో సంస్కృత భాష అభ్యాసకులు



దేవీపురం శ్రీచక్ర ఆలయం వద్ద శోభాయాత్రగా వచ్చిన సంస్కృత అభ్యాసకులు

సబ్బవరం: వేసవి శిబిరం– సంస్కృత సప్తాహం కోసం పలు రాష్ట్రాల నుంచి వచ్చిన అభ్యాసకులు మంగవారం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవిని దర్శించుకున్నారు. సంస్కృత భాషను అట్టడుగు ప్రజలకు అందించాలనే సంకల్పంతో దేశ విదేశాల్లో కృషి చేస్తున్న సంస్కృత భారతి స్వచ్ఛంద సంస్థ ఈ శిబిరాన్ని అనకాపల్లి జిల్లా కోడూరులో ఏర్పాటు చేసింది. శిబిరంలో శిక్షణ పొందుతున్న వీరంతా కోడూరు నుంచి దేవీపురం వరకూ శోభాయాత్రగా తరలి వచ్చి, దేవిని దర్శించుకున్నారు.

హెచ్‌పీసీఎల్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విశాఖలోని హెచ్‌పీసీఎల్ సీఎస్సార్ నిధులతో మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి మంగళవారం తెలిపారు. కళాశాలలో 281 మంది విద్యార్థులకు రూ.24.06 లక్షలు అందించినట్లు పేర్కొన్నారు. హెచ్‌పిసిఎల్ ఈడీ రామనాథన్ రామకృష్ణతో పాటు సీనియర్ జనరల్ మేనేజర్ కిరణ్ కుమార్, హెచ్‌ఆర్ కె.నగేష్‌లకు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది కూడా సహకరించాలని కోరారు.

మే 2న పరవాడ మండల సర్వసభ్య సమావేశం

పరవాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మే 2న ఉదయం 10 గంటలకు పరవాడ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో వి.ధర్మారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల సర్వ సభ్యసమావేశానికి పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశానికి మండలంలో వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు.

'తాడి' తరలింపుపై చురుగ్గా సర్వే



ఇంటింటి సర్వేలో మండల రెవెన్యూ అధికారులు

పరవాడ: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు తాడి గ్రామ తరలింపు కోసం పునరావాస సర్వే చురుగ్గా సాగుతోందని మండల సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు. రెండు రోజులుగా గ్రామంలో జరుగుతున్న సర్వేను మంగళవారం పరిశీలించి, సర్వే బృందానికి తగు సలహాలు, సూచనలు అందించారు. సర్వేలో ఎలాంటి లోపాలకు తావీయరాదన్నారు. సర్వే బృందానికి అవసరమైన ఆధారాలను అందించి, సహకరించాల్సిందిగా ప్రజలను కోరారు.

అధినేతతో ఆత్మీయ భేటీ



చిన్నిని అభినందిస్తున్న వైఎస్ జగన్, చిత్రంలో అమర్‌నాథ్, అదీప్‌రాజ్

పెందుర్తి: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మనాలత జోబ్‌దాస్(చిన్ని) మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలుసుకున్నారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి వెళ్లి, తనకు పదవి ఇచ్చినందుకు అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని అధినేతకు తెలిపారు.